హైదరాబాద్ వార్త

వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో సిఎంసి కమిషనర్ ఆకస్మిక పర్యటన..

-పారిశుధ్యం, చెత్త సేకరణపై సమీక్ష - ఆక్సిజన్ పార్క్ సందర్శన

జీడిమెట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి సృజన గాజులరామారం సర్కిల్ పరిధిలోని వోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో గురువారం ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో ప్రత్యక్షంగా మాట్లాడి పారిశుద్ధం, చెత్త నిర్వహణ తదితర మౌలిక సదుపాయాలపై ఆమె ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో సమావేశమై చెత్త సేకరణ విధానం, వారి బాధ్యతలపై వివరాలు తెలుసుకున్నారు. సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం అటవీశాఖకు చెందిన ప్రాణ వాయువు (ఆక్సిజన్) పార్క్‌ను సందర్శించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం, అర్బన్ బయో డైవర్సిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన ఈ పార్క్‌లో వాకర్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కాలనీలో కాలువలు, తాగునీటి సర ఫరా సమస్యలను జలమండలితో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని కమిషనర్ జి సృజన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, యూబీడీ మేనేజర్, ఎంటమాలజీ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సృజన

విధులు గాలికి..గడప దాటని అధికారులు

- కుర్చీ వద్దకే మామూళ్లు

ఫలక్‌నుమా రైతుబజార్ (ఫైల్)

సివిల్ సప్లై కార్యాయం (ఫైల్)

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : రాష్ట్రంలో కొన్ని ప్రభుత్వ శాఖలు నిర్వీర్యంగా మారాయి. పైపై పనులతో అసలు విధులను విస్మరిస్తున్నారు. ఆశాఖ ఉద్దేశ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి వారి హక్కులను కాపాడాల్సిన అధికారులు కార్యాలయాలకు, వాట్సప్ గ్రూపులకే పరమితమవుతున్నారు. దీంతో ఆశాఖలతో ప్రజలకు న్యాయం జరుగక పోగ నష్టమే ఎక్కువవుతుంది. ఇందులో తూనికలు కొలతలు, పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలున్నాయి. ఇవి పేరుకు రాష్ట్ర ప్రభుత్వంలో భాగమైన వీటిని పర్యవేక్షించేది ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది. వీటిపై ఉన్నతస్థాయిలో సమీక్షలు కరువైయ్యాయి. ఇటీవల రేషన్‌కార్డుల జారీతో అపుడపుడు పౌరసరఫరాల విభాగం (సివిల్ సప్లై) పేరు ప్రజల నోళ్ళలో నానుతుంది. మిగిలిన రెండు అతాపతా లేకుండా ఉన్నాయి. కొన్నిశాఖల అధికారులకు కూర్చున చోటే మామూళ్లు అందుతున్నాయి. వాట్సప్‌లలో తనిఖీలు, సమావేశాలు, సమాచార మార్చిడి జరుగుతోంది. విధులు విస్మరించి ఆఫీసులకే పరిమితమవుతున్నారు. తూనికలు కొలతలు....నిత్యం ప్రజల్లో ఉంటూ వాణిజ్య, వ్యాపార సముదాయాలలో వినియోగించే తూనికలు కొలతలపై నిఘా పెట్టాలి. అయితే ఈ విషయాన్ని ఆశాఖ అధికారులు విస్మరించారు. నిత్యవసర సరుకులు, పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, పాలు, నూనెలు తదితరాలు విక్రయించే కొందరు వ్యాపారులు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. తూనికలను ట్యాంపరింగ్ చేస్తున్నారు. తరాజులో మోసం ఉంటుంది. అది తక్కెడైనా, డిజిటల్ మిషిన్లైనా మోసాలు జరుగుతున్నాయి. వినియోగదారులు తూనికలు, కొలతల గురించి పట్టించుకోవటం లేదు. ఇది ఆసరాగా చేసుకొని వ్యాపారులు తెలివిగా ఒకటి తూనికల్లో, రెండవది ధరలో మోసాలకు పాల్పడుతున్నారు. ఆశాఖ అధికారులు సూపర్ మార్కెట్లు, దుకాణాలు, బడా మాళ్ళపై దాడులు నిర్వహించి వారు ఉపయోగించే తూనికలు, కొలతలను పరిశీలించాలి. మార్కెటింగ్...ఈ శాఖపై క్రమేణ ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఆశాఖ పరిధిలోకి వచ్చే రైతుబజార్ల నిర్వహణను ఎస్టేట్ అధికారులకు, సూపర్‌వైజర్లకు వదిలేశారు. నెలల తరబడిగా రైతుబజార్లలో తనిఖీల చేయటం లేదు. రైతుల సమస్యలను పట్టించుకోవటం లేదు. అంతా ఎస్టేట్ అధికారిపై వదిలేస్తున్నారు. రైతుబజార్ల నిర్వహణ చూసే ఎస్టేట్ అధికారులు ఏళ్ళ తరబడిగా పాతుకుపోయారు. ఇష్టారాజ్యంగా ఏలుతున్నారు. బినామీలకు అందలం...అసలు రైతులకు చీత్కారాలు తప్పటం లేదు. బహిరంగ మార్కెట్ల నుండి పెట్టెలలో తీసుకువచ్చిన కూరగాయలకు ప్రాధాన్యత నిస్తున్నారు. గ్రామాల నుండి కూరగాయలు తెచ్చే రైతులు నేలపై, బినామీలు మోండాలపై విక్రయాలు సాగిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు తనిఖీలు విస్మరించటంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. పౌరసరఫరాలశాఖ (సివిల్ సప్లై)...ఇది కేవలం రేషన్ దుకాణాల నిర్వాహణకే పరిమితమైయ్యింది. అయితే ఆశాఖ పరిధిలోకి వచ్చే పెట్రోలు బంకులు, గ్యాస్ సరఫరా, షాపింగ్ మాల్స్‌లో కాలపరిమితి దాటిన వస్తువుల గురించి పట్టించుకోవటం లేదు. సూపర్ మార్కెట్లు, మాల్స్‌లలో గడువు దాటిన సరుకులను విక్రయిస్తున్నారు. గతంలో జరిగిన దాడులే ఇందుకు ఉదాహరణ. గ్యాస్ డీలర్లు, సరఫరా బాయ్స్ నిబంధనలు గాలికి వదిలేశారు. గృహ, వాణిజ్య గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసే బాయ్స్ ఆటోట్రాలీలో సిలిండర్లను తూచే మిషిన్, అగ్నిమాపక పరికరాలను ఉపయోగించటం లేదు. డెలివరీ బాయ్స్‌కు ఇచ్చే కమిషన్ చాలా తక్కువగా ఉంటుంది. దీంతో వారు నిర్వాహణ కోసం వినియోగదారుల నుండి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. వీటన్నింటిని నిరంతరం పర్యవేక్షించాల్సిన ఆశాఖ కేవలం రేషన్‌కే పరిమితమైయ్యింది. ప్రైవేటు భవనాలలో కొనసాగుతున్న కార్యాలయాలను ఇటీవల నాంపల్లిలోని బహుళ అంతస్థుల బంగ్లాలోకి తరలించారు. దీంతో సార్లు ప్రజలకు మరింత దూరమైయ్యారు. మొత్తం మీద ఆయా శాఖల పరమార్థం పక్కదారి పట్టి బోర్డులు మిగిలాయి.

వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి పుష్పయాగ మహోత్సవం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్తః



పూల అలంకరణతో స్వామివారు

జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం దివ్యమైన పుష్పసుగంధాలతో, భక్తి పారవశ్య వాతావరణంలో పుష్పయాగ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17 నుండి 25వ వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. నిత్యకైంకర్యాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తుల వల్ల తెలియకుండా ఏవైనా లోపాలు సంభవించి ఉంటే, వాటి నివృత్తి కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం 5.00 గంటల నుండి 6.30 గంటల వరకు యాగశాలలో వేదపండితులచే వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి దివ్య ద్రవ్యాలతో అభిషేకం చేసి స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా సాగింది. 12 రకాల పుష్పాలు, 6 రకాల పవిత్ర ఆకులతో స్వామివారికి పుష్పసమర్పణలు నిర్వహించారు. చామంతి, రోజా, గన్నేరు, సంపంగి, మల్లె, కనకాంబరం, తామర, కలువ, మాను సంపంగి తదితర పుష్పాలతోపాటు తులసి, దవనం, మరువం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను వినియోగించారు. ఈ మహోత్సవం కోసం సుమారు 2 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా సమర్పించగా కొన్ని పుష్పాలు ప్రత్యేకంగా బెంగళూరు నుంచి వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎల్‌పీసీ చైర్మన్ ఏ.వి.రెడ్డి, ఏఈవో రమేశ్, ఆలయ అర్చకులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుమార్, శ్రీహరి తదితర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వామివారి కోసం తీసుకొచ్చిన సుగంధ పుష్పాలు.

జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- మంటల్లో దగ్ధమైన భవనం

- నలుగురు కార్మికులు సురక్షితం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లో మంటలు అంటుకున్న భవనం

జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. ఈ సంఘనటలో నలుగురు కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు. అగ్నిమాపక శాఖ, హైడ్రా డీఆర్ఎఫ్, పోలీసులు వేగంగా స్పందించడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లో కొద్ది రోజుల ముందు వరకు మంగళగౌరి వస్త్ర దుకాణం కొనసాగేది. ఇటీవలే ఆ దుకాణాన్ని మూసివేయడంతో మరో వస్త్ర దుకాణాన్ని తెరిచేందుకు బోర్డును ఏర్పాటుచేశారు. కాగా మంగళగౌరి ఉన్న సమయంలో దుకాణం ముందు ఆలయ తరహాలో సెట్టింగ్ ఏర్పాటుచేసి ముందు ధ్వజస్థంబాన్ని ఏర్పాటుచేశారు. అయితే గురువారం ఉదయం ఈ భవన సముదాయంలో వెల్డింగ్, విద్యుత్ మరమ్మతుల పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే అకస్మాత్తుగా విద్యుదఘాతం ఏర్పడి మంటలు అంటుకున్నాయి. చూస్తుండగానే ఒక్కసారిగా భవనం మొత్తం మంటలు వ్యాపించి భవనం ముందు ఫైబర్‌తో తయారుచేసిన ఆలయ నమూనాకు అంటుకున్నాయి. దీంతో మంటలు త్వరితగతిన వ్యాపించాయి. మంటలు ఉధృతం కావడంతో పక్కన ఉన్న సముదాయాల్లోని సిబ్బంది బయటకు పరుగుతు తీశారు. అదే సమయంలో భవనంలో పనిచేస్తున్న కార్మికులు అద్దాలు పగులగొట్టి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖకు చెందిన రెండు అగ్నిమాపక శకటాలు సంఘటనాస్థలానికి చేరుకున్నాయి. హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్‌లు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడంతోపాటు ట్రాఫిక్‌ను మళ్లించారు. కొద్ది సమయంలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సంఘటనాస్థలాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ సందర్శించి హైడ్రా కమిషనర్‌తో మాట్లాడారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య సంఘటనాస్థలానికి చేరుకొని పర్యవేక్షించారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి

ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పరీక్ష కేంద్రాల్లో మాలిక వసతులు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష నిర్వహణ సందర్భంగా బంజారాహిల్స్ లోని పేజ్ జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులు రాస్తున్న పరీక్షా గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకై 217 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే మొదటి సంవత్సరం 81898, రెండో సంవత్సరం 93,373 మొత్తం 175271 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలు ముగిసే వరకు కూడా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జిల్లాలో మొదటి రోజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 78377మంది హాజరయ్యారని, 2824 మంది గైరాజరయ్యారని కలెక్టర్ కు వివరించారు. తనిఖీ లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య , త్రాగు నీరు , మెడికల్ సదుపాయం, పరీక్ష కేంద్రాల పరిశుభ్రత తదితర అంశాలపై కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న, కళాశాల ప్రిన్సిపాల్ నీతూ కులకర్ణి, డీఈసీ నెంబర్ చెన్నయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్రో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివేంద్ర ప్రతాప్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

మెట్రో ఎండి సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసిన మెట్రో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జెఎండీ)గా శివేంద్ర ప్రతాప్ గురువారం బేగంపేటలోని మెట్రో రైల్ భవన్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నియామకానికి ముందు శివేంద్ర ప్రతాప్ మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్‌గా సేవలందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆయన హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిశారు. శివేంద్ర ప్రతాప్‌కు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

4వేల కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు స్వాధీనం

బేగంపేట ఫిబ్రవరి 26,ప్రభాతవార్త

అధికారులు తనిఖీలలో గుర్తించిన కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు.

లేక్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎంఎస్‌మక్తా రైల్వేగేట్ సమీపంలోని ఓ ఇంటిలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్(ఖైరతాబాద్ జోన్ టీమ్) తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలలో అత్యంత అపరి శుభ్రమైన వాతావరణంలో ఆరో గ్యానికి హానికరమైన రీతిలో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును తయారు చేస్తున్నట్లు గుర్తించా రు.పోలీసుల తనిఖీలలో జసాని ఇల్యాన్(21) అనే వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు.అతడు అబిడ్స్‌లో నివసిస్తూ జేజే ఫుడ్స్ పేరుతో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ వ్యాపారం చేస్తున్నాడు. తయారు చేసిన పేస్టును ప్లాస్టిక్ టబ్బులలో ఉంచడం వల్ల అది దూళి,పురుగులు తిరుగుతూ వినియోగానికి ప్రమాదకరంగా మారింది.ఇతను ఎక్స్ పైరీ అయిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ (నెంబరు 13624010000299) ఉపయోగిస్తూ కల్తీ పేస్టును హోటళ్లు,కిరాణా షాపులకు సరఫ రా చేస్తూ అక్రమ లాభాలు గడిస్తున్నాడు.అధికారులు దాడులు చేసిన సమయంలో 4000కేజీల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టును స్వాధీనం చేసుకున్నారు.ఇందులో 40ప్లాస్టిక్ టబ్బులలో ఉన్న 1600 కేజీల విడిపేస్టు.5కేజీల కంటైనర్లు130(650)కేజీలు,ఒక కేజీ కంటైనర్లు 900,500గ్రాముల కంటైనర్లు 300, (150కేజీలు),200గ్రాముల కంటైనర్లు 3000(600కేజీలు) 50గ్రాముల ప్యాకెట్లు 2000 (100)కేజీలు ఉన్నాయి.వీటితో పాటు ఒక పెద్ద,చిన్న గ్రైండింగ్ మిషిన్లు,5కేజీల పసు పు పొడి, 20లీటర్ల ఎసిటిక్ యాసిడ్,40బస్తాల ఉప్పు(1000కేజీలు),సరఫరాకు ఉపయోగించే అశోక్ లేలాండ్ గూడ్స్ ఆటో (టీఎస్07యుజి 5664)ను సీజ్ చేసారు.పట్టుబడిన నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న పదార్థాలను లేక్‌పోలీసు స్టేషన్‌లో అప్పగించారు.ఈ తనిఖీలలో ఖైరతాబాద్ టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ పి.రాఘవేందర్,ఎస్.ఐ.జి.శ్రీకాంత్,లేక్ పీఎస్ ఎస్సై ఎన్.శివ శంకర్,సిబ్బంది పాల్గొన్నారు.

జీడిమెట్ల ఫార్మాకంపెనీలో పేలిన రియాక్టర్

-ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు

-ముందస్తు జాగ్రత్తల్లో యాజమాన్యం నిర్లక్ష్యం

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త

ఫార్మాకంపెనీలో ముందస్తు జాగ్రత్తలను పాటించడంలో నిర్లక్ష్యం ఇద్దరు కార్మికులను తీవ్రంగా ఇబ్బందికి గురిచేసింది. ప్రమాదకరమైన రియాక్టర్ల వద్ద అన్ని సహాయ చర్యలను చేపట్టి కెమికల్స్‌ను కలిపేవిషయాలలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన యాజమాన్యం కెమిస్టులు, హెల్పర్లతో పనిని ముగించి దండుకునే విధానానికి తెరలేపడం ఇద్దరు కార్మికుల ప్రాణాలమీదికి తెచ్చింది. పోలీసులు, కార్మికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని మూడవఫేజ్‌లో స్మెలెక్స్ ఫార్మాకంపెనీ దశాబ్దకాలంగా నిర్వహిస్తున్నారు. కంపెనీలోని రియాక్టర్‌లో మెటీరియల్స్‌ను కలిపే క్రమంలో ఫార్మాసిస్టు బొమ్మిన పుల్లారావు(28)తోపాటు హెల్పర్‌గా బి.పాపారావుతో కలిసి ఏ షిఫ్టులో మిథనాల్, రామెటీరియల్స్‌లను కలుపుతుండగా స్టాటిక్ గ్యాస్‌మంటలు ఒక్కసారిగా వ్యాపించి పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల కాళ్లు,ముఖం, చేతులకు మంటలుఎగిసి పడి తీవ్రగాయాలకు గురయ్యారు. సమాచారం యాజమాన్యానికి అందించినా వారు అందుబాటులో లేకపోవడంతో 108వాహనం సహాయంతో సిబ్బంది మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయంలేకున్నా యాజమాన్యం తమకు అవసరమైన ముందుజాగ్రత్త సాధనాలు ఇవ్వకపోవడంతో ప్రమాదంలో తాము తీవ్రంగా గాయాలపాలయినట్లు వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు ఎలాంటి ముందస్తు కెమికల్ కంపెనీ వస్తువులు ఇవ్వకుండా తమకు ప్రమాదకరమైన పనిలో నియమించి పనులు పురమాయించందుకు యాజమాన్యంపై తగుచర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కార్మికులు పుల్లారావు, పాపారావులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్స్ పెక్టర్ గడ్డం మల్లేశ్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

బోడుప్పల్, ఘట్‌కేసర్‌లో ఎంఎంసి కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

-చెంగిచెర్లలోని జంతువధశాలను సందర్శించిన వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

చెంగిచర్లలో జంతు వధవాలను సందర్శించిన ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి నగర పాలక సంస్థ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, రహదారులను పరిశీలించారు. చెంగిచెర్లలోని జంతు వధశాలను సందర్శించి అక్కడి పనితీరు, పరిశుభ్రత, నాణ్యతను పరిశీలించారు.బోడుప్పల్ సర్కిల్‌లోని బోడుప్పల్ మెయిన్ రోడ్డు, ఘట్కేసర్ సర్కిల్‌లోని నారపల్లి, ఘట్కేసర్ ప్రాంతాలలో ఉదయం ఆకస్మిక క్షేత్ర స్థాయి పర్యటన చేశారు.బోడుప్పల్ మెయిన్ రోడ్డులో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. రహదారికి ఇరువైపుల చెత్త లేకుండా చూడాలని, ఊడ్చిన చెత్త కుప్పలను రోడ్డుపై వదిలేయరాదని తెలిపారు.

వీధి దీపాల నిర్వహణ...

నారపల్లిలో వీధిదీపాల నిర్వహణను ప్రత్యక్షంగా పరిక్షించారు. వీధి దీపాలపై పిర్యాదులు అందిన వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఘట్కేసర్ ప్రాంతంలో స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్‌తో మాట్లాడుతూ "చెత్త ఇంట్లో పెట్టుకోవడం ఆనందంగా ఉంటదా ఎవరికైనా, రెండురోజులకు కొంత చెత్త జమైతే ఒక రోజులో ఇంకా తక్కువ ఉంటది. పౌరులకు చెత్త బండిలో చెత్త వేయడంలో సమస్య ఏమి ఉండదు. ప్రతిరోజూ చెత్త సేకరణకు మీరు అలవాటు కావాలి, పౌరులు కూడా చెత్త సేకరించే వాహనం డ్రైవర్‌కు ఇవ్వడం అలవాటు కావాలి" అని తెలిపారు. కమిషనర్‌తో పాటు ఘట్కేసర్ డిప్యూటీ కమిషనర్ ఏ.వాణి సిబ్బంది పాల్గొన్నారు.

చెంగిచెర్ల జంతువధశాల ప్లాంట్ సందర్శన...

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి చెంగిచెర్లలోని జంతువధశాల రెండరింగ్ ప్లాంట్‌ను సందర్శించారు. రెండరింగ్ ప్లాంట్ ఎలా పని చేస్తోంది. దాని సామర్థ్య వివరాలను తెలుసుకున్నారు. రోజుకు 80టన్నుల గరిష్ఠ సామర్థం గల ఈ ప్లాంటులో ప్రస్తుతం రోజుకు 60 టన్నుల వరకు జంతు వ్యర్థాల నిర్వహణ జరుగుతుంది అని ప్లాంట్ నిర్వాహకులు తెలిపారు. జంతువధశాలలో వధించిన మాంసాన్ని మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు.

రైల్ పార్శిల్ యాప్ ద్వారా డోర్‌టూ డోర్ పార్శిల్ సేవలు : జిఎం.శ్రీవాత్సవ

కంటోన్మెంట్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:

రైల్ నిలయంలో రైల్ పార్శిల్‌యాప్‌ను ప్రారంభిస్తున్న దక్షిణ రైల్వే జిఎం

దక్షిణ మధ్య రైల్వేలో అత్యాధునీక సాంకేతికతో, పారదర్శకమైన ట్రాకింగ్ సౌకర్యంతో రైల్ పార్శిల్ యాప్ సేవలు అందుబాటు లోకి వచ్చాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. బుధవారం రాత్రి సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణా లాజిస్టిక్స్ యాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం.మాట్లాడుతూ రైళ్ల ద్వారా పార్శిళ్లను రవాణా చేయడానికి ఎంచుకునే వినియోగదారులకు ఇంటింటికి సజావుగా పార్శిల్ బుకింగ్, డెలివరీ సేవలను అందించే సమగ్ర డిజిటల్ రైల్ పార్శిల్ యాప్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రవాణా రంగంలో వస్తున్న మార్పులను అధ్యాయనం చేసి రైల్వే ఆదాయాన్ని పెంచేందుకు ప్యూహాలను రూపొందించడం జరిగిందన్నారు. బెంగుళూర్ ఐఐఎంతో దక్షిణ మధ్య రైల్వే కుదుర్చుకున్న ఒప్పంద పత్రాలను ఇరు సంస్థల ద్వారా మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఛీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతిపాండే,అదనపు జిఎం సత్యప్రకాశ్, రైల్వే ప్రిన్సిపల్ ఛీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ,ఫైనాన్షియల్ అడ్వైజర్ హేమసునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ఎప్పుడూ ముందుంటాం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

గాయత్రినగర్ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీల కాలనీల సమస్యలపై ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావును కలిసిన సంక్షేమ సంఘాల నాయకులు.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం తమ మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం గాయత్రినగర్ డివిజన్‌కు సంబంధించిన అన్ని సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. బస్తీల కాలనీలలో డ్రైనేజీ సమస్యలు, రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి కొరత, పారుశుధ్య సమస్యలు వంటి అంశాలను సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్, నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, జాహేద్ షరీఫ్, జావేదుద్దీన్, కృష్ణారావు, బొల్లు శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, శ్రీనివాసరెడ్డి, ధనరాజ్, మల్లేష్, అంకిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మౌనిక హంతకులను కఠినంగా శిక్షించాలి

జగద్గిరిగుట్టలో కోవత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో చాకలి కుటుంబానికి చెందిన వారు గుడిలోకి వచ్చి ఇచ్చిన డబ్బులకు రసీదు అడిగితే మమ్మలనే అడుగుతారా అని చెప్పి దాడి చేసి 2 నెలల పాప మౌనిక మరణానికి కారణమయ్యారని, దానికి కారణమైన ముఖ్యమైన వారిని నేటి వరకు అరెస్ట్ చెయ్యకపోవడం దారుణమని రజక సంఘం నాయకులు విట్టల్ అన్నారు. కుల దూరహంకారంతో రెచ్చిపోవడం అనగరికమని, రేవంత్ రెడ్డి బీసీ బంధువు అని చెప్పి ప్రగల్భాలు పల్కడం తప్ప నిజం కాదని దానిని నిరూపించుకోవాలంటే వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం నాయకులు విట్టల్ నాయకత్వం వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు ఏసురత్నం, రజక సంఘం నాయకులు భాస్కర్, నాగరాజు, చంద్రిమౌళి, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్ సతీష్ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబులు పాల్గొన్నారు.

సంజీవ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ధ్వజస్తంభనాకి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త 125 గాజులరామారం డివిజన్ పి.పి.నగర్‌లో నూతనంగా నిర్మించిన సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తంభన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలను తొలగిస్తూ అభయానిచ్చే దైవం ఆంజనేయస్వామి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలన్నారు. దేవాలయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్ రావు, పి.శ్రీనివాస్ రెడ్డి, చంద్రకాంత్, వివేక్, వెంకట్ రెడ్డి, భీమేశ్వర్ రావు, బాబా, నాయుడుస్ శ్రవణ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇమ్రాన్ బేగ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, మూసా ఖాన్, చెట్ల వెంకటేష్, దూలప్ప, ఆంజనేయులు, బోయిని మహేష్, రాములు గౌడ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, దండుగుల నవీన్, శ్రవణ్, సయ్యద్ రంజాన్, ప్రసాద్, శివా నాయక్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సన్మానం

భరత్ ప్రసాద్ దూబేని, వారి సతీమణి రాణిబాయి దూబేలను సన్మానిస్తున్న కౌన్సిల్ సభ్యులు

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: ఎస్సార్ నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గత వారం నిర్వహించిన మూడు రోజుల ఆధ్యాత్మిక విహార యాత్ర విజయవంతంగా పూర్తయింది. ఈ యాత్రకు అధ్యక్షులు భరత్ ప్రసాద్ దూబే పూర్తి సహకారం అందిస్తూ, యాత్రికులకు సమగ్ర మార్గని ర్దేశనం చేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. యాత్ర సాఫల్యాన్ని పురస్కరించుకుని కౌన్సిల్ సభ్యులు భరత్ ప్రసాద్ దూబేని, వారి సతీమణి రాణిబాయి దూబే దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ యాత్రను చక్కగా సమన్వయం చేసి అందరికీ స్ఫూర్తిని చ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కోదండ రామస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి సమేత కోదండరామ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత నాలుగు రోజులుగా ఆలయ ప్రాంగణంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. గురువారం ఉదయం నుండి ఆలయ ప్రాంగణంలో వేద పారాయణం కలశారాధనలు ద్వారా తోరణా ధ్వజ కుంభ ఆరాధనలు కలన్యాస హోమం ప్రాణాది దశ వాయున్యాస హోమం ఘర్తనాప్యం రత్న స్థాపన యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం శ్రీ కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి, గణపతి స్వామి, శివలింగ ప్రతిష్టాపన ఘనంగా జరిగింది. సాయంత్రం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ, కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు, హర్షణపల్లి దామోదర్ రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముషీరాబాద్‌లో ముందస్తు సందడి

-బాస్‌ల మెప్పు కోసం గన్‌మెన్‌లుగా మారుతున్న నేతలు!

చిక్కడపల్లి ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త) : జిహెచ్ఎంసి ఎన్నికల నగారా ఇంకా మోగకముందే, ముషీరాబాద్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. డివిజన్ ల వారీగా ప్రధాన పార్టీల నేతలు టికెట్ వేటలో పడ్డారు. ముఖ్యంగా అధికార ప్రతిపక్షాల మధ్య పోటీ కంటే, పార్టీలో అంతర్గతంగా టికెట్ దక్కించుకోవడానికి జరుగుతున్న పోటీ ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇందులో ముందువరుసలో బిఆర్ఎస్ శ్రేణులున్నారు. బిఆర్ఎస్ పార్టీలో టికెట్ ఆశావహుల సంఖ్య భారీగా ఉంది. స్థానిక శాసనసభ్యుడు ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జయసింహ చుట్టూ ఇప్పుడు ఆశావహుల సందడి కనిపిస్తోంది. తండ్రీ కొడుకులిద్దరూ నియోజకవర్గంలో ఏ చిన్న కార్యక్రమానికి వెళ్లినా, పెళ్లిళ్లకు హాజరైనా వారి వెంటే ఉంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు అనుచరులు. ఈ పోటీ ఎంతలా ఉందంటే, ముఠా గోపాల్‌ను ప్రసన్నం చేసుకునే క్రమంలో కొందరు నేతలు తమ హోదాను కూడా మరిచి పోతున్నారు. ఎమ్మెల్యే వెంటే ఉంటూ వారికి రక్షణగా వ్యవహరించడం, అధికారిక గన్‌మెన్ల కంటే యాక్టివ్‌గా ఉంటూ జనాలను పక్కకు నెట్టడం, ఎమ్మెల్యే కారు దిగగానే చుట్టూ భద్రతా వలయంలా ఏర్పడటం, ఒక రకంగా చెప్పాలంటే, అసలైన గన్‌మెన్లకు పనే లేకుండా ఆశావహులే ఆ బాధ్యతను భుజానికెత్తుకుంటున్నారు. "బాస్ కంట పడితేనే కదా.. రేపు సీటు సంగతి తేలేది" అన్న చందంగా వారి తీరు ఉంది.వార్డుల విభజన, రిజర్వేషన్లు ఎలా ఉన్నా, ముందుగా అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయాలని ఆశావహులు భావిస్తున్నారు. అందుకే ఎమ్మెల్యే ప్రోగ్రాం ఏదైనా సరే, అక్కడ వందమంది అనుచరులతో ప్రత్యక్షమై తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. ముషీరాబాద్‌లోని అన్ని డివిజన్ల నుంచి ఇదే తరహా పోటీ కనిపిస్తుండటంతో, రాబోయే రోజుల్లో ఈ ఖిమెప్పుఖి పొందే కార్యక్రమాలు ఇంకా ఎన్ని వింత పోకడలకు దారి తీస్తాయో చూడాలి. రాబోయే ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవాలంటే కేవలం ప్రజాబలం ఉంటే సరిపోదు, అధినాయకత్వం దృష్టిలో పడటం కూడా ముఖ్యమని ఆశావహులు భావిస్తున్నారు. అందుకే ఏ కార్యక్రమం జరిగినా వందలాది మంది అనుచరులతో హాజరై తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. రిజర్వేషన్ల లెక్కలు ఇంకా తేలకముందే, ముందస్తుగా తమ ఉనికిని చాటుకోవడానికి ఈ విధేయత రాజకీయ్యం తప్పనిసరి అని విశ్లేషకులు భావిస్తున్నారు.

నీడలా వెన్నాడుతూ..

ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఉదయం నివాసం నుంచి బయటకు వచ్చిన సమయం నుండి, తిరిగి రాత్రి ఇంటికి వెళ్లే వరకు ఆశావహులు ఆయనను నీడలా వెన్నాడుతున్నారు. ఆయన నియోజకవర్గంలో ఏ గల్లీకి వెళ్లినా, ఏ చిన్న కార్యక్రమంలో పాల్గొన్నా తమ ఉనికిని చాటుకోవడానికి పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే కంటపడితేనే భవిష్యత్తు ఉంటుందన్న ఆరాటంతో సొంత పనులను సైతం పక్కన పెట్టి మరీ ఖిముఠాఖి సేవలో తరిస్తున్నారు.

విధేయత చాటుకునేందుకు పాట్లు!

ఎమ్మెల్యే కార్యక్రమాలకు వెళ్లినప్పుడు ఆయనకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడం, జనాన్ని నియంత్రించడం, ప్రోటోకాల్‌తో సంబంధం లేకుండా అతిగా స్పందించడం వంటివి ఇప్పుడు నియోజకవర్గంలో చర్చకు దారితీస్తున్నాయి. ఎమ్మెల్యే కారు దిగకముందే డోర్ తీయడం దగ్గర నుండి, ఆయన వెంట నడుస్తూ "మేమున్నాం అని చాటుకోవడం వరకు ప్రతి విషయంలోనూ నేతల మధ్య పోటీ నెలకొంది. ఈ అతి విధేయతను చూసి సామాన్య కార్యకర్తలు ముక్కున వేలేసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రసన్న రాజకీయాలు ఏ తీరానికి చేరుతాయో చూడాలి.

ముషీరాబాద్ గులాబీ కోటలో.. ఉద్యమ కెరటాల హోరు!

కార్పొరేటర్ల బరిలో మేం సిద్ధం.. ముఠా జైసింహాకు ఉద్యమకారుల విన్నపం

చిక్కడపల్లి ఫిబ్రవరి 26 (ప్రభాతవార్త) : తెలంగాణ మలిదశ ఉద్యమ సెగల్లో కాలి, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ముషీరాబాద్ ఉద్యమకారులు ఇప్పుడు ప్రజాక్షేత్రంలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి తమకు కార్పొరేటర్లుగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఉద్యమకారుల దండు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు, యువనేత ముఠా జైసింహాను కోరింది. గురువారం భారీ సంఖ్యలో తరలివచ్చిన ఉద్యమకారులు జైసింహాను మర్యాదపూర్వకంగా కలిసి, తమ మనోగతాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ భావోద్వేగాన్ని ప్రకటిస్తూ.. "నాడు స్వరాష్ట్ర సాధన కోసం లాఠీ దెబ్బలు తిని, జైలు గోడల మధ్య నలిగిన చరిత్ర మాది. పదవుల కోసం కాకుండా, ప్రజల సేవ కోసం నిరంతరం శ్రమిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమైన ఉద్యమకారులకు ఈసారి టికెట్లు ఇస్తే, పార్టీ విజయకేతనం ఎగురవేయడం ఖాయం." తమ విన్నపాన్ని

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు, యువనేత ముఠా జైసింహాను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు

పార్టీ అధిష్టానం మరియు ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్లి, ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని వారు ముఠా జైసింహాను వేడుకున్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, ఉద్యమకారుల సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సీనియర్ ఉద్యమకారులు కల్వ గోపి, రేషం మల్లేష్, అజయ్ ముదిరాజ్, సిరిగిరి శ్యామ్, నేత శ్రీనివాస్, పున్న సత్యనారాయణ, బిక్షపతి, జోగేందర్, వేణు యాదవ్, బాలరాజ్, దేవయ్య, చంద్రశేఖర్ యాదవ్, వంశీ చింతకింది, మందుల నరసయ్య, విట్టల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పసిపాప మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి : సీఐటియూ

హైదరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: నాగర్‌కర్నాల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల పసిపాపను కాళ్లతో తన్ని, పాప మృతికి కారణమైన అగ్రకుల పెత్తందారులను కఠినంగా శిక్షించాలని సీఐటియూ నగర ఉపాధ్యక్షులు జి.రాములు డిమాండ్ చేశారు. గురువారం గోల్నాక లేబర్ అడ్డాలో సిఐటియూ అంబర్‌పేట్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరై రాములు మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చి, 75 సంవత్సరాలు పూర్తి అయినపనపటికీ, ఇంకా దేశంలో కుల వివక్ష, అంటరానితనం విలయతాండవం చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక, ఇటువంటి ఘటనలు పెరిగిపోయాయని ఆరోపించారు. గుళ్లోకి మేము ఎందుకు రాకూడదని ప్రశ్నించిన పాపానికి, వారిని బూతులు తిడుతూ, కాళ్లతో తన్నుతూ, చివరకు పసిపాప చావుకు కారణమయ్యారంటే మనం ఎటువంటి సమాజంలో ఉన్నామో అర్థమవుతోందన్నారు. బాధితులు న్యాయస్థానాల్లో,

గోల్నాక లేబర్ అడ్డాలో నిరసన కార్యక్రమం చేపట్టిన సీఐటియూ నేతలు

చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని, పోలీస్‌స్టేషన్‌కు వెళితే, పోలీసులు కూడా బాధితులపైనే కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేస్తూ, పెత్తందారుల పక్షాన నిలబడి, వారికి కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్నాక నాయకులు సాయిలు, సహదేవు, రేణుక, శోభ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీర్ సావర్కర్ నిజమైన దేశ భక్తుడు : దాసి నాగరాజు

వీర్ సావర్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాగరాజు

నిజాంపేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త భారత స్వాతంత్ర్య ఉద్యమం లో పాల్గొన్న కొంతమంది నాయకులు సకల సౌకర్యాలు జైలులో అనుభవించిన సమయంలో అండమాన్ జైలులో 10 సంవత్సరాలు అత్యంత కఠిన కారాగార శిక్ష అనుభవించిన నిజమైన భారత స్వాతంత్ర సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. గురువారం వీర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ దాసి నాగరాజు వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కమలాకర్, భవాని, సుధారాణి, సుహార్షిని, ప్రేమ్ సాయి, నిహారిక, మణికంఠ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మంద మకరంద్

త్తాపూర్ ఫిబ్రవరి26, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా మంద మకరందు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన అనురాగ్ జయంతి యాదాద్రి కలెక్టర్‌గా వెళ్లడంతో గురువారం రాజేంద్రనగర్‌లోని జోనల్ కార్యాలయంలో ఆయన మంద మకరందు బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయనకు రాజేంద్రనగర్ డీసీ సురేందర్ రెడ్డి, అత్తాపూర్ డీసీ సమ్మయ్యలు పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ...విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రతి ఒక ఉద్యోగి భాధ్యతయు తంగా పని చేయాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గాంధీనగర్ ట్రాఫిక్ సిఐ వెంకట్‌రెడ్డి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ డి.వెంకట్‌రెడ్డి

ముషీరాబాద్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గాంధీనగర్ ట్రాఫిక్ సిఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందిరాపార్కు చౌరస్తాలో గాంధీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో వాహనదారులకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు, పాదచారులకు అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి, వాహనాలు నడపటం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితులలో వాహనాలు నడిపే అవకాశం ఇవ్వకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఏకాగ్రతతో వాహనాలు నడిపితే, రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఇద్దరికి మించి ద్విచక్రవాహనాలపై ప్రయాణించకూడాదని, వాహనాలు నడిపేవారు అన్ని జాగ్రత్తలూ తీసుకుని, తోటి వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ట్రిబుల్ రైడింగ్ చేసినా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పెంటాగౌడ్, సిబ్బంది శివ, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

నాగ్‌నాథ్ మాశెట్టికి సత్కారం

చార్మినార్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : పాతబస్తీ కోకరివాడి ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త,తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి గత ఎన్నో ఏళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గురవారం జరిగిన కార్యక్రమంలో నాగ్‌నాథ్ మాశెట్టి,జగదేవి మాశెట్టి దంపతులను బాల్కీ హిరేమఠం పీఠాధిపతి మహాఘువ చక్రవర్తి శ్రీ గురు బసవ పట్టదేవరు ఘనంగా సత్కరించారు.ఈ కార్యమ్రంలో హిరేమఠం సంస్థాన్ కార్యదర్శి శ్రీ మహాలింగ స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.

నిజాంపేట్ డంపింగ్ యార్డ్ సమస్యకు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే కారణం : ఆకుల సతీష్

నిజాంపేట్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త నిజాంపేట్ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త సమస్యకు మున్సిపల్ అధికారుల నిరక్ష్య ధోరణే ప్రధాన కారణమని స్థానిక నాయకుడు ఆకుల సతీష్ ఆరోపించారు. సమస్య రోజు రోజుకు తీవ్రరూపం దాల్చి ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన సుమారు 2000 టన్నుల చెత్తను తక్షణమే తరలించేందుకు రోజుకు కనీసం 50 లారీలను వినియోగించాలని, రోజుకు కనీసం 200 టన్నుల చెత్త తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకుడు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌లో హిటాచీల సహాయంతో చెత్తను ఒక వైపుకు తరలించి, ప్రతిరోజూ వచ్చే ఆటోలు సులభంగా లోపలికి వెళ్లే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్య తీవ్రరూపం దాల్చడానికి కారణమైన డిప్యూటీ కమిషనర్‌పై విచారణ జరిపి తగిన చర్యలు

డంపింగ్ శాటిలైట్ ట్రాన్స్‌ఫర్ సెంటర్‌ను సందర్శించిన ఆకుల సతీష్

తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు జగద్గిరిగుట్ట డంపింగ్ శాటిలైట్ ట్రాన్స్ ఫర్ సెంటర్‌ను సందర్శించినట్లు తెలిపారు. సమస్యల వివరాలు, సూచించిన పరిష్కారాలతో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు వెల్లడించారు.ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే ఈ సమస్యను అధికారులు అత్యవసరంగా పరిష్కరించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో కుంభాభిషేకం

చిక్కడపల్లి ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నందు కొలువుదీరిన పంచముఖ ఆంజనేయ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం గురువారం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పరివార సహిత శివాలయ నవగ్రహ పునఃప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఆలయం ధర్మాధికారి కళా విఎస్ జనార్దన మూర్తి నేతృత్వంలో అత్యంత వైభవంగా ముగిశాయి. వేద మంత్రాల సాక్షిగా..ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ఉదయం నుంచే ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్దన మూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా క్రతువులను నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ మహాపూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ప్రధాన ఘట్టాలైన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా విగ్రహాలకు ప్రాణకళను చేకూర్చే ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆగమశాస్త్ర విధివిధానాల ప్రకారం నిర్వహించారు. కుంభాభిషేకం ఉత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకం, కలశాభిషేకం కార్యక్రమాల

ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్న వేదపండితులు

ను కనులపండువగా జరిపారు. పవిత్ర జలాలతో కలశాలకు అభిషేకం చేస్తుండగా భక్తుల జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబైన అయ్యప్పస్వామి దేవాలయం



యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్2లోని మల్లన్న స్వామి ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయ 18వ వార్షిక మహోత్సవాలు ఈ నెల 27 శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 4 గంటలకే శుప్రభాత సేవ, 5 గంటలకు శ్రీ లక్ష్మిగణపతి హోమం, 9 గంటలకు 108 కళశాలతో స్వరాభిషేకం, మ.12.30 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు దీపారాధన, సా.6.

ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడ్‌పల్లి శ్రీభక్త హన్‌మాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌లు తెలిపారు. కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భక్త హన్‌మాన్ దేవాలయం శ్రీరామ,శివపంచాయత, నవగ్రహ సహిత నూతన విగ్రహ పున: ప్రతిష్ట ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్,సంతోష్ యాదవ్, నందికంటిరవి, అల్లాడి గౌరి శంకర్,గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు,బస్తీ పెద్దలు ఎస్.శ్యామ్ సుందర్ రెడ్డి,పిట్ల నాగేశ్, ప్రవీణ్, వీరన్న, సంజయ్, సదానంద్ గౌడ్, రఘు,పిట్ల శ్రీను, రాజ్‌గోపాల్, వినోద్, సునీల్, హరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నియమాలే రక్ష
- ఇన్‌స్పెక్టర్ మక్తగూడెం దాసు

వాహనదారులకు ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ దాసు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : సురక్షితమైన ప్రయాణానికి ట్రాఫిక్ నియమాలే రక్షని, ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మక్తగూడెం దాసు కోరారు. అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం బాబానగర్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దాసు మాట్లాడుతూ మోటారు సైకిల్ నడిపే వ్యక్తి, అతని వెనుక సీటులో ప్రయాణించే వ్యక్తి సైతం హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లు నడిపే వ్యక్తులు తప్పని సరిగా సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడవద్దని స్పష్టం చేశారు. మైనర్లను వాహనాలు నడిపేందుకు అనుమతించవద్దని హితువు పలికారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే సంబంధిత వాహనదారుడిపై, వాహనం నడిపిన మైనర్‌పై కేసు నమోదైయ్యే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సురక్షితమైన ప్రయాణానికి ట్రాఫిక్ నియమాలు ఎంతగానో ఉపయోగ పడతాయని, వాహనదారులు వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్సైలు, వాహనదారులు పాల్గొన్నారు.

పేదల వైద్య సేవలకు ప్రాముఖ్యం : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: పేద రోగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని తాము సద్వినియోగం చేసుకుంటామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన నామాలగుండుకు చెందిన మహమ్మద్ సనా ఉల్లా ఖాన్, అడ్డగుట్టకు చెందిన అన్నగాని వెంకటయ్య, చిలకలగుడా కు చెందిన మహమ్మద్ నయీం ఖాన్ ఖాద్రి, మెట్టుగూడ కు చెందిన సరస్వతి లు అస్వస్థతకు గురై, సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని సహాయానికై ఆశ్రయించారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్ వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను పొందేందుకు వీలుగా ఎల్.ఓ.సి. పత్రాలను తన కార్యాలయంలో అందించారు. సరస్వతికి రూ. 50 వేలు, నయీంఖాన్ ఖాద్రికి 1.50 లక్షలు, అన్నగాని వెంకటయ్యకు రూ. లక్ష, మహమ్మద్ ఉల్లా ఖాన్‌కు రూ.1.50 లక్షల మేరకు మొత్తం రూ. 4.50 లక్షల విలువజేసే ఎల్.ఓ.సీ. పాత్రలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితాఫలమండీలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఎబివిపి, ఆర్ఎస్ఎస్ గుండాల దాడిని ఖండించిన ఎఐఎస్ఎఫ్

సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య

సైఫాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: మధ్యప్రదేశ్‌లోని హరిసింగ్ విశ్వవిద్యాలయంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమ నాయకులు జిల్లా మహాసభ ఏర్పాటులో భాగంగా పోస్టర్లు, బ్యానర్లు కడుతున్నవారిపై ఆర్ఎస్ఎస్, ఎబివిపి గుండాలు విచక్షణా రహితంగా దాడి చేసి, హత్యా ప్రయత్నం చేయడాన్ని ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి తీవ్రంగా ఖండించింది. గురువారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి చైతన్య మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెరుగుతున్నదని, మనుషుల మధ్య విద్వేషాలను రెచ్చగోడుతూ మత పునాది ద్వారా రాజ్యమేలుతున్న మతోన్మాద శక్తుల కారణంగానే ఈ ఘటన జరిగిందన్నారు. విద్యార్థి నాయకులపై జరిగిన దాడి సంఘటనపై సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపి దుండగులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థి సమస్యలపై ఎబివిపి పోరాడకుండా మతం అడ్డుపెట్టుకుని పిరికిపందల్లా దాడి చేయడం సిగ్గు చేటని ఆయన నిశితంగా విమర్శించారు.ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ఉప్పల ఉదయ్‌కుమార్, జోసెఫ్‌భాను, సుశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కంటోన్మెంట్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సమాజంలోని పేద ప్రజలకు వృద్ధాప్య భవనాలు, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు,స్కాలర్‌షిప్ వంటి సేవా కార్యక్రమాలు పద్మశాలి సేవా సమితి నిర్వహించడం అభినందనీయమని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని పద్మశాలి కళ్యాణ మండప పున: నిర్మాణం చేసి పేద మధ్య తరగతి ప్రజలకు అన్నిహంగులతో నిర్మించిన రెనవేషన్ కళ్యాణ మండప ప్రారంభోత్సవ వేడుకలు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బడుగు,బలహీనవర్గాలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికి పూర్తి స్థాయిలో సేవలు అందించలేక పోతున్నామన్నారు. అందు వల్ల సమాజిక వర్గంలో ఉన్న పేద ప్రజలను ఆదుకునేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్,మాజీ ఎంపీ రాపోలు అనంద భాస్కర్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లి కార్జున్, మోండా డివిజన్ మాజీ కార్పోరేటర్ కొంతం దీపిక, పద్మశాలి సేవా సమాజం ట్రస్ట్ చైర్మన్ నోముల రామ్ ప్రకాశ్,ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రమేష్, ఉపాధ్యక్షులు సంగిశెట్టి రవి, కోశాధికారి శ్రీనివాస్ రావ్,మాజీ చైర్మన్ గుత్తికొండ పాండు, ట్రస్ట్ సభ్యులు ప్రభాకర్, విశ్వనాథం, చంద్రమౌళి,నర్సింగ్ రావ్,సంగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి పద్మశాలి కళ్యాణ మండపం రెనవేషన్‌ను ప్రారంబిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు

మనిషిని సంపూర్ణంగా ఆవిష్కరించిన మౌనం : డా. కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : ప్రతీమనిషికి ఏదో రకమైన లోపం సహజమని, ఆవిషయాన్ని దృష్టిలో పెట్టుకుని 320 పేజీల్లో మనిషి ఆకారం, రంగు, అవగుణాల గురించి తెలుపుతూ మనిషిని సంపూర్ణంగా ఆవిష్కరించిన రచయిత్రి శ్రీలత అభినందనీయురాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. రచయిత్రి శ్రీలత రచన పేరు మౌనం కానీ పుస్తకం చదివాక మౌనంగా ఉండరు... రోధిస్తారు లేదా అరుస్తారని అభిప్రాయపడ్డారు. మౌనం రచనలో సౌందర్యం ప్రకాశించేది మనిషి యొక్క మనస్సునుబట్టి కానీ దేహంబట్టి కాదని తెలుపుతుందన్నారు. ఈ సందర్భంగా పుస్తకంలోని విషయాన్ని గురించి క్లుప్తంగా ఉటంకించారు. ప్రతీఒక్కరూ తప్పక చదవాల్సిందేనని రమణాచారి స్పష్టం చేశారు. యువకళా వాహిని ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి గౌరవాధ్యక్షులు డా. పి.రాజేంద్రకుమార్, విజయదుర్గ, మోడేపల్లి కొండయ్య, పన్యాల నారాయణరెడ్డి, సంస్థ అధ్యక్షుడు కళావాచస్పతి లంక లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి ప్రముఖ విద్యావాచస్పతి డా. మోదేపల్లి శ్రీలత కోటపాటి, రచయిత్రి శ్రీలత కొండయ్య దంపతులుతో కలిసి రచించిన మౌనం పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ముందుగా రచయిత్రి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతర ఇతర అతిథులు ప్రసంగించారు,

మౌనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఓలేటి, లంకలక్ష్మీనారాయణ, రచయిత్రి శ్రీలత దంపతులు, విజయదుర్గ తదితర అతిథులు

దేశ వ్యాప్తంగా 'రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ'

సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: దేశ సంపదను, ప్రజలను కాపాడుకుందాం, దేశ ద్రోహులైన మనువాదుల పాలన నుంచి డా.బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, దళిత బహుజనులను కాపాడుకుందాం అనే నినాదంతో మార్చి 1 నుంచి జూన్ 30 వరకు దేశ వ్యాప్తంగా 'రాజ్యంగ పరిరక్షణ ర్యాలీ'ని నిర్వహిస్తున్నామని దళిత బహుజన పార్టీ ప్రకటించింది. గురువారం నాడికడ్క పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ తెలంగాణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మాట్లాడారు. అంబేద్కర్ సమత రాజ్యాంగం స్థానంలో మనువాద బ్రాహ్మణ దోపిడీ రాజ్యాంగంను తీసుకురావడానికి నరేంద్రమోదీ, అమిత్‌షా సర్కార్ సిద్ధంగా ఉందని ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకోకపోతే దళిత బహుజన సమాజానికి భవిష్యత్ ఉండదని, మధ్య యుగాలు నాటి బానిసత్వం తప్పదని హెచ్చరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న జీవన, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన ఆందోళనలు చేపడతామన్నారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రాంచందర్, నాయకులు శంకర్, రాజలింగం, ఈశ్వర్, జైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు నిరాశ్రయులను ఆశ్రమానికి తరలింపు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: చిలకలగూడ డివిజన్ ఏసీసీ శశాంక్‌రెడ్డ ఆద్వర్యంలో చిలకలగూడ, వారాసిగూడ పోలీసులు గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో నిరాశ్రయుల కోసం చెక్ చేయగా ఇద్దరు వ్యక్తులు ఆపస్మారక స్థితిలో కనిపించారు. వారిని వెంటనే గాంధీ ఆస్పత్రిలో చేర్చి వైద్య చికిత్సలు అందించిన అనంతరం వారిని ఆశ్రమానికి తరలించారు. అంతకు ముందు వారి దుస్తులను మార్చి భోజనం పెట్టించారు. ఈ సందర్భంగా ఏసీపీ శశాంక్‌రెడ్డి మాట్లాడుతూ ఎండా కాలం కావడం వల్ల చాలామంది సరైన తిండి,నీరు లభించని కారణంగా సృహకోల్పోయి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వారిని మానవతా దృక్పదంతో ఆదుకోడానికి ప్రయత్నించాలని కోరారు.

ఆకట్టుకున్న మహాలక్ష్మి కూచిపూడి నృత్యం

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా హస్తినాపురంకు చెందిన అమర్ సింహారెడ్డి, రూప దంపతుల కుమార్తె మహాలక్ష్మి కూచిపూడి నృత్యప్రదర్శనను ఇక్కడ ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. సంప్రదాయ వస్త్రాధరణతో, శాస్త్రీయ లయబద్ధతతో ఆమె చేసిన నృత్యం, భావాభినయాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. గణపతి స్తోత్రంతో ప్రారంభించి నవరసాలను ప్రతిబింబించే నృత్యభాగాలతో చిన్నారి తన ప్రతిభను ఆవిష్కరించారు. మహాలక్ష్మి అర్క ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతుంది.

కూచిపూడి నృత్యం చేస్తున్న మహాలక్ష్మి.

పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- జెడ్సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్ సర్కిల్ అధికారులతో సమావేశమైన జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని జీహెచ్‌యంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం నర్కి పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో చార్మినార్ సర్కిల్ పారిశుధ్య అధికారులు, సిబ్బందితో సమావేశమైయ్యారు. సర్కిల్ పరిధిలో పారిశుధ్య నిర్వాహణపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశాల మేరకు జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. అధికారులు స్వచ్ఛ ఆటోల పనితీరును మరింత మెరుగు పరచాలని సూచించారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా నిర్ణీత సమయాలలో ఇళ్ళ నుండి చెత్తను సేకరించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. రహదారులపై, ఓపెన్ పాయింట్ల వద్ద చెత్త కుప్పలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్రింది స్థాయి నుండి పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత,ఎస్‌డబ్ల్యూఎం డిఈ శ్రీరాములు, సానిటరీ సూపర్వైజర్,జవాన్లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సిటీ కళాశాలలో పరిశోధన విధానాలపై సదస్సు

సదస్సులో మాట్లాడుతున్న సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.శాంతి

చార్మినార్,ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం పరిశోధన విధానాలు అన్న అంశంపై సదస్సు జరిగింది.హానర్స్ ప్రోగ్రామ్‌లో చదువుతున్న డిగ్రీ విద్యార్థులలో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించటం,అకడమిక్ పరిశోధనలో ఉపయోగించే శాస్త్రీయ విధానాలు,సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా వర్క్ షాప్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వం సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి మాట్లాడుతూ పరిశోధన విధానం, అడమిక్ అవగాహనానికి అత్యంత అవసరమని తెలిపారు.గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి విచ్చేసిన డా.బి.జగన్నాధం పరిశోధన సమస్య గుర్తింపు,పరిశోధన రూప కల్పన.ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను వివరంగా తెలియజేశారు.ఇగ్నోలో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ డా.సౌజన్య పరిశోధన నిర్వాహణలో అనుసరించవలసిన ఆచరణాత్మక అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధిపతి,సదస్సు కన్వీనర్ డా.ఎల్.తిరుపతి,డా.కె.భాస్కర్,డా.బి.భూపాల్,డి.చైతన్య,జి.ఐశ్వర్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అత్తాపూర్ ఫిబ్రవరి26ప్రభాతవార్త : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ రాజు పేర్కొన్నారు.అరైవ్ అలైవ్ రెండవ దశ ప్రచారంలో భాగంగా గురువారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పిఎస్ పరిధి దుర్గానగర్‌లోని రూప్ సాగర్ షాపింగ్ మాల్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను నియంత్రించడంలో మహిళలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, అతివేగంతో వెళ్లడం వంటివి చేయరాదని వాహనదారులు హెల్మెట్‌లు,సిట్ బెల్టులు తప్పకుండా పెట్టుకోవాలన్నారు. వాహనదారులు సురక్షితంగా గమ్య స్థలానికి చేరుకోవాలంటే నిబంధనలు పాటించాలని సూచించారు.

సర్కార్‌దేనని రెవెన్యూ రికార్డుల్లో ఉంది : ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త

సున్నం చెరువులో హైడ్రా వదిలేసిన భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించడంతో సంతోషమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. ప్రధానంగా సున్నం చెరువులోని 29, 30 సర్వే నంబర్ల భూమి ప్రభుత్వ భూమేనని రెవెన్యూ రికార్డుల్లో స్పష్టమని తెలిపారు. అసోసియేషన్, స్థానికుల ఫిర్యాదులతో స్వయంగా వెళ్లి పరిశీలించానన్నారు. ఆ భూమిని హైడ్రా టేకప్ చేసి పార్క్‌గా అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని, లేకపోతే కబ్జాలకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఆ భూమిపై అగ్రిమెంట్లు చేసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. గతంలో ఎంఆర్వో, ఇరిగేషన్ తదితర శాఖలు కలిసి ఫెన్సింగ్ చేసినట్లు చెప్పారు. హైడ్రా కమిషనర్‌కు చిత్తశుద్ధి ఉంటే మిగిలిన భూమిని కూడా టేకప్ చేసి ఫెన్సింగ్ చేయాలని, లేదంటే అనుమానాలు తలెత్తుతాయని వ్యాఖ్యానించారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్‌కు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధికి సహకరిస్తాను కానీ కబ్జాలను సహించబోనని స్పష్టం చేశారు. నల్లచెరువు, సున్నం చెరువుల అభివృద్ధికి ధన్యవాదాలు తెలిపినా, కబ్జాలు జరిగితే ఊరుకోనని హెచ్చరించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 1310 ఎకరాల భూమి కాపాడినట్లు చేసిన ప్రకటనను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేయొద్దని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. కూకట్‌పల్లిలో ప్రభుత్వ భూమిని 148 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పార్కులు, పాఠశాలలు, ఎస్టీపీలు, స్మశానవాటికలు నిర్మించామని పేర్కొన్నారు. తాను కాపాడిన భూముల విలువ వేల కోట్ల రూపాయలు అయినా ఎప్పుడూ ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. దాదాపు 1310 ఎకరాల ప్రభుత్వ భూమి కూకట్‌పల్లిలో లేదని స్పష్టం చేశారు.కూకట్‌పల్లిలో కబ్జాలు జరిగితే నిర్ధారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శేర్లింగంపల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల భూములను కూకట్‌పల్లికి ముడిపెట్టొద్దని సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములన్నింటికీ తానే ఫెన్సింగ్ చేయించానని తెలిపారు.చెరువుల అభివృద్ధికి మద్దతు ఇస్తాను కానీ అక్రమాలను సహించనని స్పష్టం చేశారు. సర్వే నంబర్1007 భూమిపై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు, కోర్టులో ఉన్న భూమిపై తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు.

బార్కాస్ ద్విముఖ ఆంజనేయస్వామి విగ్రహ ధ్వంసం కేసులో నల్గురు అరెస్టు
- వీరిలో మయన్మార్‌కు చెందిన ముగ్గురు మైనర్లు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట బార్కాస్ ప్రాంతంలోని ద్విముఖ ఆంజనేయస్వామి దేవాలయ అపవిత్రత, చోరీ కేసులో ఒక వృద్ధునితోపాటు ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ కథనం ప్రకారం... ఈనెల 24వ తేదీ తెల్లవారు జామున గుర్తు తెలియిన వ్యక్తులు కొందరు చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్కాస్ ప్రాంతంలో ఉన్న శ్రీ ద్విముఖ ఆంజనేయ స్వామి దేవాలయం తాళాలు పగుల గొట్టి ఆలోయంలోకి ప్రవేశించారు. గర్భగుడిలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. అక్కడ గల రాగి పాత్రను దొంగలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ ప్రతినిధులు, బిజెపి నేతలు అక్కడికి చేరుకొని నిరసన తెలిపారు. నిందితులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక బీజేపీ నాయకులు జె. నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాంద్రాయణగుట్ట పోలీసులు క్రైమ్ నంబర్ 80/2026, యు/ఎస్, 298, 299, 324(2), 331(3), 305 ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్, ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సిసిటివి దృశ్యాలను పరిశీలించాయి. బాలాపూర్ రాయల్ కాలనీ ప్రాంతానికి చెందిన ముగ్గురు మైనర్లు అనుమానాస్పదంగా తిరుగుతూ, పాలిథిన్ బ్యాగులో వస్తువులను తీసుకెళ్లడం గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, చెడు వ్యసనాలకు బానిసలై ఖర్చుల కోసం ద్విముఖ ఆంజనేయ స్వామి ఆలయం తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు, ఆ సమయంలో విగ్రహాన్ని దెబ్బతీసినట్లు అంగీకరించారు. నిందితులు బాలాపూర్‌లోని రాయల్ కాలనీలో నివసించే మయన్మార్ మూలాలు గల వారిగా గుర్తించారు. దొంగలించిన వస్తువులను ఈదిబజార్ బన్‌నాఖకు చెందిన, తుక్క వ్యాపారం చేసే మొహమ్మద్ అబ్దుల్ వహీద్(60)కు విక్రయించినట్లు చెప్పారు. స్క్రాప్ యజమానితోపాటు ముగ్గురు మైనర్లను గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కేసు దర్యాప్తులో ఉంది. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతిభద్రతలను, మత సామరస్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని, స్థానికంగా ఉద్రిక్తతలు సృష్టించి మతసామరస్యానికి భంగం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

సోషల్ మీడియాలో వచ్చే వార్తలను, ధృవీకరించని సమాచారాన్ని, పుకార్లను నమ్మవదని, ప్రచారం చేయద్దని కోరారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని హితువు పలికారు.

ఘనంగా ధ్వజస్థంభ ప్రారంభోత్సవ వేడుకలు

క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తాం : ఎసిపి సుబ్బరామిరెడ్డి

మహిళా కానిస్టేబుల్ సుంకరి మేఘన ను సన్మానిస్తున్న ఎసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

మలక్ పేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని మలక్ పేట ఏసీపీ సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారిలు పేర్కొన్నారు. ఇటీవల సైబరాబాద్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మహిళల వాలీబాల్ విభాగంలో హైదరాబాద్ సిటీ మహిళా వాలీబాల్ జట్టు మొదటి స్థానం సాధించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ కు చెందిన మహిళ కానిస్టేబుల్ కుమారి సుంకరి మేఘన హైదరాబాద్ మహిళా వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, తన అద్భుత నాయకత్వం, ప్రతిభతో జట్టును విజయానికి నడిపించారని వివరించారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ లో జరిగిన కార్యక్రమంలో మలక్ పేట ఎసిపి సుబ్బరామిరెడ్డి చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారిలు కుమారి సుంకరి మేఘన ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలీస్ శాఖకు కీర్తి తీసుకువచ్చినందుకు ఆమెను ప్రశంసించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

-డిప్యూటీ కమిషనర్ శ్రీహరి

కాప్రా మదర్ ప్రెస్ క్లబ్ ప్రధాన పత్రికల నూతన కమిటీనీ అభినందించిన కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి.

కుషాయిగూడ, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త : ప్రభాతవార్త. కాప్రా ప్రెస్ క్లబ్ (ప్రింట్ మీడియా సీనియర్ జర్నలిస్టుల సంఘం రిజిస్టర్ నం. 489/2020) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులందరూ కలిసి నూతన కమిటీని ఎంపిక చేశారు.అధ్యక్షులు: జ్యోతిర్మయ చారి (వార్త) ప్రధాన కార్యదర్శి: ఆదిమూలం శ్రీనివాస్ (సాక్షి)కోశాధికారి: వట్టిపల్లి సురేష్ (జనం సాక్షి)నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తోటి జర్నలిస్టులందరికీ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సలహాదారులు కడియాల రమేష్, (నమస్తే తెలంగాణ)కే సి మోహన్,(నమస్తే తెలంగాణ) చంద్రమోళి (ఈనాడు), క్యాసని సత్యనారాయణ సాగర్ (నవతెలంగాణ), సహదేవా చారి (ఆంధ్రజ్యోతి) ఉల్లోజు శ్రీనివాస్ (ఆంధ్రప్రభ) తో పాటుగా సీనియర్ జర్నలిస్టులు భాస్కర్ రెడ్డి, గడ్డమీది బాలరాజ్ గౌడ్, సిరా శ్రీనివాస్, విజయ్, శంకర్, లక్కిడి బాల్ రెడ్డి, పలుగుల పవన్, అనిల్, సాంబశివుడు, సురేందర్, నర్సింగ్ గౌడ్, ప్రసాద్, రోజా రాణి, రాము తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే బలాల

రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్ పేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: మలక్ పేట నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ముసారాంబాగ్ డివిజన్ లోని ముసారాంబాగ్ బస్తిలో నూతనంగా నిర్మించిన రోడ్డు నిర్మాణం పనులను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ప్రతినిత్యం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

30 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు పనులు : ప్రేమ్ కుమార్

సిసి రోడ్డు పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్

మల్కాజిగిరి ఫిబ్రవరి 26,ప్రభాతవార్త : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లో 30 లక్షల రూపాయల నేలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. గురువారం డివిజన్ పరిధిలోని జవహర్ నగర్లోని లైఫ్ హాస్పిటల్ సమీపంలో 30 సీసీ రోడ్డు పనులను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో ప్రజలకు మరిన్ని మౌలిక ఒకసారి కల్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నారాయణ శ్రీనివాస్ రెడ్డి ముత్యంరెడ్డి జాన్ కాశి ప్రసాద్ పద్మావతి మల్లేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలుతాయి మహాప్రభో

-చెత్తను తొలగించండి వ్యాధులను నివారించండి

తుర్కయంజాల్ ఫిబ్రవరి26, ప్రభాతవార్త

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ మరియు ఇంద్రమ్మ నగర్ కాలనీ మధ్యలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించే విషయంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు శ్రద్ధ వహించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే చెత్త చెదారం వల్ల పందులు. కుక్కల వల్ల దోమలు, ఈగలు, పందులు ఇలాంటివి కాలనీలో ఎక్కువ ఉండడం వల్ల ప్రజలు కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆకస్మికంగా వర్షాలు కురు స్తుండడంతో ఈగలు, దోమలు, వ్యాప్తి చెందుతున్నాయని మొరుగు దుర్వాసన పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు పందుల వల్ల, విష జ్వరాలు, స్వైన్ ఫ్లూ వంటి ప్రాణాంతక వ్యాధులు సభ ఇస్తే కాలనీవాసులు భయపడుతున్నారు. తుర్కయంజాల్ డివిజన్ లక్ష్మీ నగర్ కాలనీ, మరియు ఇంద్రమ్మ నగర్ కాలనీ రోడ్డు ప్రక్కలనే స్మశాన వాటిక రోడ్డు పక్కన చెత్త పేరుకుపోతున్న పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బంది పట్టించుకోవడంలే దని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో ఖాళీ స్థలం ఉన్నందువలన చెత్త వేయడంతో స్థానికంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీ నగర్ కాలనీ రోడ్డు పక్కన చెత్త దృశ్యం

పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా చేయాలని ఎవరైనా చెత్త వేస్తే వారికి జరిమానా విధించాలని కూడా మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీల పరిధిలో 15 రోజుల కోసారి పాగింగ్ చేయాలని కాలనీవాసులు కోరారు. ఓవైపు దుర్వాసనతో అల్లాడుతుంటే మరోవైపు దోమలు. పందులు బెడతా ఎక్కువైంది కాలనీలో ఇప్పటివరకు ఒక్కసారి కూడా పాగింగ్ చేయలేదు దీంతో దోమలు పెరిగిపోయి బయట నిలబడలేని దుస్థితి నెలకొంది అధికారులు వెంటనే స్పందించి పాగింగ్ స్ప్రే చేయించాలని కాలనీవాసులు తెలియజేశారు. లేనియెడల కలెక్టరు ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలి : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

మలక్ పేట, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త: వాహనదారులు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధ్వర్యంలో అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా ముసారాంబాగ్ పివిఆర్ మాల్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. జీబ్రా క్రాసింగ్ ల వినియోగం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు రైడర్, పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐలు రాము, వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమ, నిబంధనాలపై అవగాహన కల్పిస్తున్న మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ , చిత్రంలో ఎస్ఐలు రాము, వినోద్ కుమార్ తదితరులు

రోడ్డు ప్రమాదాల నివారణకు సేఫ్టీ మార్కింగ్స్ : ఎంపీఆర్

ఉప్పల్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు సెఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేయిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ రహదారిలో సేఫ్టీ మార్కింగ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. సేఫ్టీ మార్కింగ్స్ కోసం ప్రభుత్వం రూ.32 లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సర్కిల్ పరిధిలోని 13 ప్రాంతాలలోని జంక్షన్లల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రధాన రహదారులలోని జంక్షన్ల వద్ద త్వరలోనే సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉప్పల్ మాల బస్తీ జంక్షన్, మహాదేవ్ మోటార్స్, సౌత్ స్వరూప్ నగర్ జంక్షన్, వెంకటేశ్వర దేవాలయ జంక్షన్, టెంపుల్ కామాన్ జంక్షన్, రామాలయం దేవాలయ జంక్షన్, టీఎక్స్ హాస్పిటల్ జంక్షన్, మండే మార్కెట్ జంక్షన్, సత్య నగర్ జంక్షన్, ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీ పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ వీధి, సూర్య నగర్ జంక్షన్, దేవేందర్ నగర్ రోడ్, రేస్ కోర్స్ రోడ్ జంక్షన్ లలో సేఫ్టీ మార్కింగ్స్ ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రంలో కాంగ్రెస్ పార్టీ నేతలు లింగంపల్లి రామకృష్ణ, పాసికంటి నాగరాజు, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఈగ అంజనేయులు, అల్వాల్ భాస్కర్, గొరిగే మహేష్, బాకారం అరుణ్, బి.మదన్ గౌడ్, బజారు నవీన్ గౌడ్, ఢిల్లీ చంద్రశేఖర్ ,జిత్తు ,నరేష్ కన్నా గౌడ్, రంగులు శేఖర్,వంశీ గౌడ్,శివ,చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ రహదారిలో సేఫ్టీ మార్కింగ్స్ పనులు పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.వరమేశ్వర్‌రెడ్డి తదితరులు

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో కాలనీవాసుల ధర్నా

-ఎఎంసి శ్రీధర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసన ఆందోళన

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: సమస్యలను నివేదించడానికి జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి వచ్చిన వివిధ కాలనీవాసుల పట్ల ఎఎంసి (అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్) శ్రీధర్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణితో అవమానపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు ధర్నాకు దారి తీసాయి. తమ ప్రాంతాల్లోని సమస్యలను చెప్పుకొని వాటి పరిష్కారం కోసం వచ్చిన తమపై సదరు అధికారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడంపై తీవ్ర మనస్థాపానికి గురైన బాధితులు అప్పటికప్పుడు ఆందోళనకు పూనుకున్నారు. ఎఎంసి బెదిరింపు ధోరణి, అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ వారంతా ఏకంగా సర్కిల్ కార్యాలయంలోని డిసి ఛాంబర్ ముందు బైఠాయించి ఆందోళనకు దిగడం తీవ్ర కలకలం రేకెత్తించింది. దీంతో స్పందించిన డిప్యూటీ కమీషనర్ సరస్వతి ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి సముదాయించడంతో కాలనీవాసులు శాంతించారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని మారుతీనగర్, భీష్మనగర్, సాయిగోకుల్‌నగర్, ఎజిఆర్ కాలనీలతో పాటు పలువురు బడంగ్‌పేట్ పాత గ్రామానికి చెందిన వారు తమ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం బడంగ్‌పేట్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ బంగారు అనితారాణి ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు వారంతా ఎఎంసి శ్రీధర్‌రెడ్డిని కలిసి డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలను వివరించారు. క్రమం తప్పకుండా తామంతా పన్నులు చెల్లిస్తున్నా తమ ప్రాంతాల్లో సమస్యలు మాత్రం తీరడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే అదే సమయంలో కొందరు సెల్ ఫోన్‌లో వీడియోలు తీస్తుండంగా ఆగ్రహించిన ఎఎంసి శ్రీధర్‌రెడ్డి తీవ్రంగా బెదిరించి ఆపు చేయించారు. అంతే కాకుండా సమస్యలను పట్టించుకోకుండా కాలనీవాసులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యపూరిత సమాధానాలు ఇచ్చారు. దీంతో ఖంగుతిన్న కాలనీవాసులు తేరుకొని బాధ్యతగల అధికారి తమను అవమానిస్తూ వ్యాఖ్యలు చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సర్కిల్ కార్యాలయంలో ఆందోళన చేసిన వారిలో జగన్, సైదులు, సందీప్, ఆంజనేయులు, సురేందర్‌రెడ్డి, మురళీకృష్ణ, రాహుల్, తీగల మహేందర్‌రెడ్డి, రమణగుప్త, బాపనయ్య, కిరణ్ రాజ్, క్యారగారి అరవింద్, ప్రవీణ్‌గౌడ్, మహేందర్ యాదవ్, శ్రీనివాస్ గుప్తలతో పాటు పలువురు ఉన్నారు.

ఎఎంసి శ్రీధర్‌రెడ్డి అనుచిత తీరును నిరసిస్తూ బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న వివిధ కాలనీలవాసులు, బడంగ్‌పేట్ గ్రామస్తులు

వివాదాస్పదమవుతున్న శ్రీధర్‌రెడ్డి వ్యవహారశైలి

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో అన్నీ తానైనట్లు వ్యవహరిస్తున్న ఎఎంసి శ్రీధర్‌రెడ్డి వ్యవహారశైలిపై విమర్శలు వినవస్తున్నాయి. ఇటీవల బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిహెచ్ఎంసిలో విలీనమైనప్పటి నుండి ఆయన ధోరణి విపరీతంగా మారిందని సాక్షాత్తు కార్యాలయ ఉద్యోగులే ఆరోపిస్తుండడం గమనార్హం. గతంలో ఆయన మిట్టమధ్యాహ్నం ఏకంగా తన ఛాంబర్‌లోనే నిద్ర పోవడం తీవ్ర దుమారం లేపింది. కార్యాలయంలో పని చేసే ఉద్యోగులకు ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏమాత్రం విలువనివ్వకుండా ఆయన విపరీత ధోరణి కనబరుస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. కొన్ని సంవత్సరాల క్రితం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేనేజర్‌గా పని చేసి బదిలీపై వెళ్ళి మళ్ళీ ఇక్కడికే బదిలీపై వచ్చి రెచ్చిపోతున్న శ్రీధర్‌రెడ్డి సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయంలోనే వివక్షాపూరిత అహంకార నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అభద్రతాభావం వల్లో మరే కారణం వల్లో ఇక్కడి ఉద్యోగులు ఆయన మితిమీరిన ప్రవర్తనను దిగమింగుకొని పని చేస్తుంటే మరీ రెచ్చిపోతున్న శ్రీధర్‌రెడ్డి ఈ సారి ఏకంగా సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలపై తన ప్రతాపం చూపడం చర్చనీయాంశమైంది.

సరస్వతి శిశు మందిరాలు ప్రతి చోటా ఉండాలి: సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: విద్యార్థుల్లో సత్ప్రవర్తన, వ్యక్తిత్వ వికాసానికి సరస్వతి శిశు మందిరాలు దోహదపడుతున్నాయని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చే బడంగ్‌పేట్ పాత గ్రామంలోనున్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవన ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరస్వతీ విద్యా పీఠం దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డిచే భవనాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఆమె స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో భారతీయ ఇతిహాసాలు చిన్నారులకు చెప్పే వారే కరువయ్యారని అన్నారు. అయితే సరస్వతి శిశు మందిరాల్లో మాత్రం సంస్కృతి సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ బాలల వక్తిత్వ వికాసానికి కృషి జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం సుధాకర్‌రెడ్డి ,బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, విద్యాపీఠం తెలంగాణ ప్రాంతం సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, బడంగ్‌పేట్ సరస్వతి శిశు మందిర్ అధ్యక్షులు మదన్ మోహన్ ధరక్, సామ సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు పెద్దబావి సమరసింహారెడ్డి, కార్యదర్శి, పూర్వ విద్యార్థి దొడ్డి మల్లికార్జున్, ఉపకార్యదర్శి రామిడి శూరకర్ణారెడ్డి, కందికంటి గణేష్‌గౌడ్, కిరణ్‌గౌడ్, నర్సింహగౌడ్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, స్థానిక మాజీ కార్పొరేటర్లు భీమిడి స్వప్న జంగారెడ్డి, సూర్ణగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, సిబ్బంది, భవన నిర్మాణదాతలు, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సరస్వతీ శిశు మందిర్ భవన ప్రారంభోత్సవంలో సబితా ఇంద్రారెడ్డి, పారిజాత నర్సింహారెడ్డి, లింగం సుధాకర్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి తదితరులు

లోక కళ్యాణం వేదిక, కమ్యూనిటీ హాల్, క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన

తుర్కయంజాల్ ఫిబ్రవరి26,ప్రభాతవార్త

ఆదిభట్ల సర్కిల్ తుర్క యాంజాల్ డివిజన్ తొర్రూర్ పరిధిలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్ రెడ్డి బాల్ రెడ్డి లోక కళ్యాణ వేదిక,కమ్యూనిటీ హాల్, మరియు క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మరియు రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, నాయకులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. అదే విధంగా వారు మాట్లాడుతూ తుర్కయంజాల్ డివిజన్ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల విస్తరణకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కమ్యూనిటీ హాల్ సామాజిక కార్యక్రమాలు, వివాహాలు, సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని, క్రీడా ప్రాంగణం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో ముద్దగోని రామ్మోహన్ గౌడ్ . మాజీ వైస్ ఎంపీపి మల్ రెడ్డి యాదిరెడ్డి, తుర్కయంజాల్ సహకార బ్యాంకు డైరెక్టర్ వంగేటి లక్ష్మా రెడ్డి, మరియు తొర్రూర్ రెడ్డి సంక్షేమ సంఘం పెద్దలు సభ్యులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాలనీల సమస్యలపై మాజీ కార్పొరేటర్ దృష్టి

నేరేడ్ మెట్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త : డ్రైనేజీ, వాటర్‌లైన్, రహదారి పనులపై అధికారులకు ఆదేశాలు డివిజన్ పరిధిలో కాలనీ వాసుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి శనివారం పర్యటించి సమస్యలను పరిశీలించారు.వినాయక్‌నగర్ లైన్ నంబర్-17 లో డ్రైనేజీ కారణంగా రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడిన విషయాన్ని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.అలాగే రేణుక నగర్‌లో బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తయినప్పటికీ వాటర్‌లైన్ పనులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించారు. అధికారులతో మాట్లాడి రేపటినుంచే పనులు ప్రారంభించాలంటూ ఆదేశించారు.తదనంతరం జేకే కాలనీలో సాగుతున్న నూతన రహదారి పనులను పరిశీలించిన రాజ్యలక్ష్మి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, కాలనీ వాసులు, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయి సురేష్, జగదీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

హబ్సిగూడ జంక్షన్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

విధ్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ

తార్నాక, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త : నగర ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హబ్సిగూడ జంక్షన్‌లో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థులు,వాహనదారులు, ప్రయాణికులకు రహదారి భద్రత నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, కారులో ప్రయాణించే సమయంలో సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేయరాదనే నియమాలపై పోలీసులు స్పష్టంగా వివరించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా ఓయూ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ప్రమాదరహిత నగరాన్ని నిర్మించగలమని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా శ్రీసాయినామ శతకోటి జప మహా యజ్ఞం

ప్రత్యేక పూజలు నిర్వహించిన స్